సాక్షి వరంగల్

బుధవారం । 8 । నవంబర్ । 2023



పసుపులో అంతరపంటగా మిరప

పసుపులో అంతరపంటగా మిరపపంటను సాగు చేసి అందరిదృష్టిని ఆకర్షించారు దుగ్గొండి మండలం తొగర్రాయి గ్రామానికి చెందిన రైతు.

- IIIలో▸



విద్యార్థులు కళారంగంలో...

కళారంగంలో రాణించాలని కాంప్లెక్స్ హెచ్ఎం పాపమ్మ అన్నారు. చెన్నారావుపేట కేజీబీవీలో మంగళవారం కళా ఉత్సవం పోటీలను ఆమె ప్రారంభించారు.

- IIIలో▸

గరిష్టం/కనిష్టం

29°/22°

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం సాధారణ స్థితిలో ఉంటుంది. మధ్యాహ్నం పలుచోట్ల ఆకాశం మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

వర్ధన్నపేట: కళాశాల విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు 2023–24 సంవత్సరానికి వర్ధన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న చరిత్ర సబ్జెక్టు విభాగంలో గెస్ట్ లెక్చరర్ నియామకానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పోషయ్య మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నియామక ప్రక్రియ త్రిసభ్య కమిటీ ద్వారా జరుగుతుందని, దరఖాస్తులు ఈ నెల 14 సాయంత్రం 4 గంటల వరకు వర్ధన్నపేట డిగ్రీ కళాశాలలో స్వీకరించబడుతాయని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 73863 21745 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఎమ్మెల్సీ 'పోచంపల్లి' వాహనం తనిఖీ



నల్లబెల్లి: ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి వాహనాన్ని మండలంలోని బోల్లోనిపల్లి చెక్‌పోస్ట్ వద్ద మంగళవారం ఎస్సై నైనాల నగేష్ తనిఖీ చేశారు. వాహనాన్ని క్షుణంగా పరిశీలించారు. ఎలాంటి నగదు లభించకపోవడంతో వదిలివేశారు. ఈ తనిఖీల్లో ఏఈ సారా ఫ్లోరెన్స్, బీఎస్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

పీహెచ్‌సీని సందర్శించిన జిల్లా పీఓ



పర్వతగిరి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ)లో గర్భిణులు, బాలింతలకు ఇచ్చే న్యూట్రిషియన్ కిట్లలో సరుకులు మాయమవుతున్నాయని బాధిత మహిళలు సోమవారం ఆందోళన చేపట్టిన విషయం విదితమే. ఈ మేరకు జిల్లా మదర్ సెయింట్ ప్రాజెక్టు ఆఫీసర్ పద్మశ్రీ మంగళవారం పర్వతగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. న్యూట్రిషన్ కిట్లలో సరుకులు మాయమైన సంఘటనపై విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా సంఘటనకు బాధ్యులైన సిబ్బందిపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.

కేయూలో మరో కొండచిలువ

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో సోమవారం రాత్రి ఫార్మసీ హాస్టల్ సమీపంలో మరో కొండచిలువ సంచరిస్తుండగా పలువురు విద్యార్థులు చూశారు. క్యాంపస్‌లోని వివిధ విభాగాల సమీపంలోని చెట్ల పొదల్లో కూడా పలు కొండచిలువలు సంచరిస్తున్నాయి. దీంతో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే క్యాంపస్‌లోని ఫార్మసీ కళాశాల – జియాలజీ విభాగం మధ్యలో, శిథిలావస్థకు చేరి మూతపడిన ప్రతాపరుద్ర హాస్టల్ పరిసర ప్రాంతాల్లో కొండచిలువలు సంచరిస్తున్నాయని సమాచారం. అటవీశాఖాధికారులు చొరవ తీసుకొని క్యాంపస్‌లో సంచరిస్తున్న పలు కొండచిలువలు పట్టుకొని తీసుకెళ్లి అటవీప్రాంతాల్లో వదిలివేయాల్సిన అవసరం ఉందని, యూనివర్సిటీ అధికారులు చర్యలు చేపట్టాలని కేయూ ఫార్మసీ కళాశాల ప్రొఫెసర్ గాదె సమ్మయ్య కోరారు.

బాధ్యతల స్వీకరణ

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీగా పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ అండ్ ఎంహెచ్‌ఆర్‌ఎం విభాగం ఆచార్యులు పి.శ్రీనివాస్‌రావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు సెక్రటరీగా బాధ్యతలను నిర్వర్తించిన డాక్టర్ సవితాజ్యోత్స్న నుంచి శ్రీనివాస్‌రావు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ యూనివర్సిటీలో క్రీడల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.


పరకాల.. అభివృద్ధి వెనకాల
- నియోజకవర్గంలో సమస్యల తిష్ట
- 'సాక్షి' గ్రౌండ్ రిపోర్ట్

'పల్లా' ఆస్తులు రూ.22కోట్లు..
- అప్పులు రూ.5.68కోట్లు
- ఎన్నికల అఫిడవిట్‌లో వెల్లడి

రూ.14.17లక్షల నగదు జప్తు..
- వాహనాల తనిఖీల్లో సీజ్

- IIలో▸

పెరిగేనా.. తగ్గేనా..?



ఓటింగ్ తీరుపై సర్వత్రా ఆందోళన
- గత ఎన్నికలకంటే గణనీయంగా పెరిగిన ఓటర్లు
- అవగాహన కల్పించే దిశగా అధికారులు
- ఓటేయించేలా నాయకుల అడుగులు..
- 2023 ఎన్నికల్లో చర్చనీయాంశంగా ఓటింగ్ శాతం

సాక్షిప్రతినిధి, వరంగల్: గెలుపు ఓటముల మాట అటుంచితే.. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటింగ్ సరళిపై అటు అధికారులు ఇటు నాయకుల్లో ఆందోళన పెరుగుతోంది. అసలే సార్వత్రిక ఎన్నికలు అందులో ఈసారి శాసనసభ సభ్యుల కోసం జరుగుతున్నాయి.

2014, 2018 పోలింగ్ సరళిని పోలిస్తే ఈసారి ఏ మేరకు ఓటేస్తారనే చర్చ సర్వత్రా జరుగుతోంది. ప్రతీసారి స్థానిక సంస్థల ఎన్నికలతో పోలిస్తే.. అసెంబ్లీ ఎన్నికల సమయంలో పోలింగ్ శాతం తగ్గుతుంటుంది. ఈసారి జరిగే ఈ ఎన్నికల్లో ఓటర్లు ఎంతవరకు చైతన్యాన్ని చూపిస్తారనేది చర్చనీయాంశంగా మారింది. పోటీ చేస్తున్న అభ్యర్థులు ఉన్న తక్కువ సమయాన్ని సద్వినియోగ పర్చుకునేలా శరవేగంగా ప్రచారం సాగిస్తుండటంతో ఎక్కువ సంఖ్యలో ఇంటింటికి వెళ్లి ఓటర్లను కలిసే అవకాశం ఉండడం లేదు.

నియోజకవర్గం	మొత్తం ఓట్లు (2014)	పోలైన ఓట్లు (2014)	2014లో పోలింగ్ శాతం	2018లో పోలింగ్ శాతం	2023 మొ.ఓటర్లు
జనగాం	2,13,869	1,72,291	80.6	85.70	2,29,609
స్టేషన్ ఘన్‌పూర్	2,22,556	1,79,265	80.5	88.03	2,42,981
పాలకుర్తి	2,05,591	1,75,198	85.2	88.72	2,43,730
డోర్నకల్	1,91,331	1,64,681	86.1	88.87	2,14,154
మహబూబాబాద్	2,16,685	1,75,027	80.8	84.74	2,45,765
నర్సంపేట	2,05,516	1,81,337	88.2	90.08	2,26,617
పరకాల	1,93,398	1,64,220	84.9	89.30	2,17,054
వరంగల్ పశ్చిమ	2,44,544	1,40,772	57.6	58.55	2,77,125
వరంగల్ తూర్పు	2,05,277	1,48,180	72.2	73.08	2,46,282
వర్ధన్నపేట	2,28,268	1,77,545	77.8	83.72	2,60,555
భూపాలపల్లి	2,37,742	1,89,612	79.8	82.16	2,68,028
ములుగు	1,96,393	1,52,834	77.8	82.51	2,20,886

ఓటింగ్ శాతం పెంచే దిశగా...

ఓటు హక్కు కలిగిన ప్రతిఒక్కరూ ఓటును వినియోగించుకునేలా ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో అధికారులు ప్రత్యేక అవగాహన కార్యక్రమాల్ని నిర్వహిస్తున్నారు. ఇందుకోసం ఆగస్టు 21న జిల్లాకో సిస్టమేటిక్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ ఆఫీసర్ (స్వీప్)లను నియమించారు. ఓటర్ల నమోదు మొదలు మాక్ పోలింగ్ వరకు అవగాహన కల్పించేందుకు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వృద్ధులు, దివ్యాంగులు నేరుగా ఇంటి నుంచే ఓటువేసే విధంగా ఏర్పాట్లు చేయడంతోపాటు ఎలాంటి ఆందోళనలకు గురి కాకుండా పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వినియోగించుకునేలా ప్రణాళికల్ని రూపొందిస్తున్నారు. హనుమకొండ, వరంగల్, జేఎస్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, జనగామ జిల్లాల్లో పాలనాధికారుల పర్యవేక్షణలో అవగాహన సదస్సులు, చైతన్య ర్యాలీలను నిర్వహిస్తున్నారు. ఓటు చైతన్యం కోసం వాల్‌పోస్టర్లు కరపత్రాలు పంపిణీ చేస్తున్నారు. ఇక వీరికి తోడుగా పలు స్వచ్ఛంద సంస్థలు కూడా తమవంతు తోడ్పాటును అందించేలా ఓటు చైతన్యంపై భిన్నమైన తరహాలో కార్యక్రమాల్ని నిర్వహిస్తున్నాయి.

ఇదే సమయంలో ప్రతి ఓటరును తమకు అనుకూలంగా మలచుకునే క్రమంలో ప్రధాన రాజకీయ పార్టీల నాయకులు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. ఓటు నమోదు మొదలుకుని వారంతా ఓటేసే విధంగా ప్రయత్నాలు చేస్తున్నాయి. ఈక్రమంలో అందరి ప్రయత్నాలు ఫలించి ఓటింగ్ శాతం పెరుగుతుందా? లేక తగ్గుతుందా? అన్న చర్చ జరుగుతోంది.

గణనీయంగా పెరిగిన ఓటర్లు...

2014, 2018 ఎన్నికలతో పోలిస్తే.. ఈసారి ఓటర్లు గణనీయంగా పెరిగారు. పెరిగిన ఓటర్లకు అనుగుణంగా పోలింగ్ ఓటింగ్ శాతం కూడా పెరుగుతుందా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కొన్ని సందర్భాల్లో ఓటింగ్ శాతం హెచ్చు తగ్గులపైనా ఆయా పార్టీల అభ్యర్థుల జయాపజయాలు కూడా ఆధారపడి ఉండే అవకాశం ఉంది. 2014 ఎన్నికల పోలింగ్ సరళితో పోలిస్తే 2018లో పోలింగ్ శాతం కూడా ఒకటి నుంచి ఎనిమిది శాతం వరకు ఆయా నియోజకవర్గాల్లో పెరిగింది. 2023 వచ్చే సరికి గణనీయంగా పెరిగిన ఓటర్ల నమోదుకు అనుగుణంగా పోలింగ్ శాతం పెరుగుతుందా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. 2014లో అత్యల్పంగా వరంగల్ పశ్చిమలో 57.6 శాతం, వరంగల్ తూర్పులో 72.2 శాతం ఓటింగ్ నమోదు కాగా.. 2018 ఎన్నికలకు వచ్చే సరికి వరంగల్ పశ్చిమలో 58.55, తూర్పులో 73.08 శాతంకు చేరింది. ఆ రెండు నియోజకవర్గాల్లో వరుసగా 2014లో 2,44,544, 2,05,277 ఓటర్లుంటే... 2023కు వచ్చే సరికి 2,77,125, 2,46,282 మందికి చేరింది. అలాగే 2018లో నర్సంపేటలో అత్యధికంగా 90.08 శాతం ఓటింగ్ నమోదు అయ్యింది. 2023 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఓటర్ల నమోదుకు అనుగుణంగా ఓటింగ్ శాతం కూడా పెరగాలన్న కోణంలో అధికారులు ఓటు వినియోగం, చైతన్యంపై విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.

కంట్రోల్ రూమ్‌ను పరిశీలించిన కలెక్టర్



వరంగల్ కలెక్టరేట్‌లో ఫిర్యాదుల కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

వరంగల్ అర్బన్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రావీణ్య మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. 24 గంటలు పని చేసే ఫిర్యాదుల కేంద్రం, విజిల్, కంట్రోల్ రూం, 1950, సోషల్ మీడియా ఫిర్యాదుల నమోదును పరిశీలించి మరింత సమర్థంగా నిర్వహించేందుకు అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎన్నికల సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ ఎన్నికల ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని ఆదేశించారు. సీ- విజిల్ యాప్ ద్వారా ఇప్పటివరకు 38 కేసులు నమోదు కాగా అన్ని పరిష్కారించామని అన్నారు. ఎన్నికల సంబంధిత, ఓటరు వివరాల కోసం 1950టోల్ ఫ్రీ నంబర్‌కు 237కాల్స్ రాగా పరిష్కరించామని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభ పెడుతున్నట్లు ఫిర్యాదులు వచ్చినా.. మీడియాలో ఫేక్ న్యూస్ ప్రసారమైన వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. యువత సీ-విజిల్ యాప్‌ను ఉపయోగించి ఎన్నికల్లో జరిగే అక్రమాలు, ఉల్లంఘనలను తమ దృష్టికి తీసుకుని రావాలని, 24 గంటలు కలెక్టరేట్ కార్యాలయంలోని సమీకృత జిల్లా ఫిర్యాదుల పర్యవేక్షణ కేంద్రం నుంచి సీ-విజిల్ యాప్ ఫిర్యాదులపై పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. అనుమతి లేకుండా ర్యాలీలు నిర్వహణ, ఇతర ఎన్నికల ఉల్లంఘనలపై లైవ్ ఫొటోలు, వీడియోలు సీ-విజిల్ యాప్ ద్వారా పంపాలని సూచించారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ వాసు చంద్ర, డీపీఆర్‌ఓ ఆయూబ్ అలీ, ఏఓ శ్రీకాంత్, డీఐఓ అప్పిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మార్గదర్శకాలకు అనుగుణంగా పనిచేయాలి

- సీ- విజిల్ యాప్‌పై ప్రచారం చేపట్టాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి

వరంగల్ అర్బన్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అధికారులు, సిబ్బంది ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా బాధ్యతయుతంగా విధులు నిర్వర్తించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి ఎన్నికల ప్రత్యేక సాధారణ, వ్యయ, పోలీస్ పరిశీలకులు అజయ్ వి.నాయక్, దీపక్ మిశ్ర, ఆర్.బాలకృష్ణన్, డీజీపీ అంజనీ కుమార్, రాష్ట్ర ఉన్నత స్థాయి అధికారులతో కలిసి అసెంబ్లీ ఎన్నికల ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీసీలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రావీణ్య, ఆర్‌ఓ, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వికాస్ రాజ్ మాట్లాడుతూ.. నామినేషన్ ప్రక్రియ ముగిసిన తర్వాత పోటీలో ఉండే అభ్యర్థుల సంఖ్య ఆధారంగా అవసరమైన మేర ఈవీఎం యంత్రాలు సర్దుబాటు చేసుకోవాలన్నారు. నవంబర్ 18న రెండో దశ ఈవీఎం యంత్రాల ర్యాండమైజేషన్ కు చర్యలు తీసుకోవాలని అన్నారు. పెండింగ్ ఓటరు నమోదు దరఖాస్తులను మూడు రోజుల వ్యవధిలో పరిష్కరించాలని అన్నారు. ఎన్నికల తనిఖీలో నగదు, బంగారం, ఇతర ఆభరణాలు జప్తు చేసే సమయంలో ఈ.ఎస్.ఎం.ఎస్ యాప్‌లో నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. సమావేశాలు, సభలు నిర్వహించుకునేందుకు అభ్యర్థుల నుంచి వచ్చే దరఖాస్తులకు సకాలంలో అనుమతులు మంజూరు చేయాలని అన్నారు. ఓటర్ స్లిప్పుల పంపిణీకి చర్యలు చేపట్టాలన్నారు. ప్రతిరోజు ఓటరు స్లిప్పుల పంపిణీపై సమీక్ష నిర్వహించాలని అన్నారు. వీసీలో కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. జిల్లాలో ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించేందుకు చర్యలు చేపట్టామన్నారు. అభ్యర్థులు, ఎలక్షన్ ఏజెంట్లకు సీ-విజిల్ యాప్, సువిధా గురించి అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. వీసీలో ఆర్డీఓ వాసు చంద్ర, జిల్లా సహకార అధికారి సంజీవ రెడ్డి, డీబీసీడీఓ పుష్పలత, డీఎస్సీడీఓ భాగ్యలక్ష్మి, కలెక్టరేట్ పరిపాలనాధికారి శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

వంద శాతం పోలింగ్‌కు కృషి చేయాలి



మహిళలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

పర్వతగిరి: నవంబర్ 30వ తేదీన జరిగే ఎన్నికల్లో వంద శాతం పోలింగ్ అయ్యేలా ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా కృషి చేయాలని జిల్లా నోడల్ ఆఫీసర్, అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ గొట్టె శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ సహకారంతో మహిళా సంఘాల ప్రతినిధులు, గ్రామ సంఘాల కార్యకర్తలు, ప్రాజెక్టు సిబ్బంది, దివ్యాంగులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో దివ్యాంగులు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధి భారిన పడిన వారు వారి ఓటు హక్కును మరింత సులభంగా వినియోగించుకోవడానికి జాతీయ ఎన్నికల కమిషన్ చాలా సౌకర్యాలను అందుబాటులోకి తెచ్చిందన్నారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వం కల్పిస్తున్న వసతులతో స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు. దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు ఉచిత రవాణా పొందడానికి ప్లే స్టోర్ ద్వారా sakshyam.ECIAPP యాప్ డౌన్‌లోడ్ చేసుకొని రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ప్రాజెక్టు సిబ్బంది, ప్రభుత్వ సేవకులుగా ఉన్న వారందరూ ఎలక్షన్ కోడ్ నియమావళి పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో సీడీపీఓ, వర్ధన్నపేట నియోజకవర్గ నోడల్ ఆఫీసర్ శ్రీదేవి, అడిషనల్ నోడల్ ఆఫీసర్ రంగయ్య, మండల సమాఖ్య ఏపీఎం తోటకూరి కృష్ణమూర్తి, మండల సమాఖ్య అధ్యక్షురాలు నాగమణి తదితరులు పాల్గొన్నారు.

కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

- సమావేశాలు, ర్యాలీలకు అనుమతి తప్పనిసరి
- వరంగల్ ఏసీపీ బోనాల కిషన్



మాట్లాడుతున్న ఏసీపీ బోనాల కిషన్

రామన్నపేట: అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ అమల్లో ఉన్నందున రోడ్లపైన, పబ్లిక్ ప్రదేశాల్లో ఎటువంటి అనుమతులు లేకుండా ఐదుగురు అంతకుమించి గుమిగూడి ఉన్న చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వరంగల్ ఏసీపీ బోనాల కిషన్ అన్నారు. మంగళవారం వరంగల్ ఏసీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు ర్యాలీలు, సమావేశాలు, ఇంటింటి ప్రచారాలు చేసుకోవడానికి ప్రచార రథాలు తిప్పడానికి రిటర్నింగ్ అధికారి అనుమతి తప్పనిసరి అని స్పష్టం చేశారు. ప్రైవేట్ శుభకార్యాలు, బర్త్‌డే పార్టీలు, ఆత్మీయ సమ్మేళనాలు, కుల, వన భోజనాలకు వెళ్లినప్పుడు పార్టీలకు సంబంధించిన కండువాలు ధరించడం ఓట్లను అభ్యర్థించడం, ఓటర్లను ప్రభావితం వంటివి పాల్పడకూడదని పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలకు పాల్పడితే కార్యక్రమ నిర్వాహకులపై కేసు నమోదు చేస్తామని తెలిపారు. రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు ఎన్నికల ప్రచారం చేయవద్దని, ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు దేవాలయాల్లో, చర్చిల్లో, మసీదుల్లో, ప్రార్థన మందిరాల్లో , ప్రభుత్వ కార్యాలయాల్లో ఎన్నికల ప్రచారం నిషేధమన్నారు. ప్రైవేట్ ఫంక్షన్ హాల్స్‌లో అనుమతులు లేకుండా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తే ఆ అభ్యర్థులపైనా, ఫంక్షన్ హాల్ యజమానులపైనా కేసులు నమోదు చేస్తామన్నారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తే 1950, పోలీసు టోల్ ఫ్రీ నంబర్ 100కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని కోరారు.

కొనసాగుతున్న నామినేషన్ల పర్వం



నర్సంపేట: నామినేషన్ పత్రాలను అందజేస్తున్న పెంచాల శ్రీనివాస్



నర్సంపేట: నామినేషన్ వేస్తున్న రమేష్



వర్ధన్నపేట: పత్రాలు అందజేస్తున్న కృష్ణారెడ్డి



పరకాల: నామినేషన్ పత్రాలు అందజేస్తున్న బీజేపీ అభ్యర్థి కాళీప్రసాద్

నర్సంపేట: జిల్లాలో ఏర్పాటు చేసిన ఆర్‌ఓ కేంద్రాల్లో నామినేషన్ల పర్వం కొనసాగుతోంది. ఈక్రమంలో మంగళవారం వివిధ పార్టీలతోపాటు, ఇండిపెండెంట్ అభ్యర్థులు, వారి తరపు నాయకులు నామినేషన్ పత్రాలను ఆర్‌ఓలకు సమర్పించారు. నర్సంపేట నియోజకవర్గ పరిధిలో మంగళవారం మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. దుగ్గొండి మండలం మహ్మదాపురం గ్రామానికి చెందిన పెంచాల శ్రీనివాస్ భారతీయ జనతా పార్టీ, స్వతంత్ర్య అభ్యర్థిగా రెండు సెట్లు, నర్సంపేట సాయినగర్‌కు చెందిన పెద్దారపు రమేష్ ఎంసీపీఐ(యూ) అభ్యర్థిగా నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి కృష్ణవేణికి అందజేశారు. ఇప్పటి వరకు నియోజకవర్గ పరిధిలో పది నామినేషన్లు దాఖలు చేసినట్లు అధికారులు వెల్లడించారు.

వర్ధన్నపేటలో..

వర్ధన్నపేట: వర్ధన్నపేట శాసనసభ నియోజకవర్గ కేంద్రంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కేఆర్ నాగరాజు తరఫున అనిమిరెడ్డి కృష్ణారెడ్డి నామినేషన్ దాఖలు చేయగా భారతీయ జనతా పార్టీ అభ్యర్థి కొండేటి శ్రీధర్ తరఫున సిలువేరు ఆనందం నామినేషన్ పత్రాలు రిటర్నింగ్ అధికారి అశ్విని తానాజీ వాఖడేకు సమర్పించారు. గతంలో ఇద్దరు నామినేషన్లు దాఖలు చేయగా మంగళవారంతో నామినేషన్లు సమర్పించారు. దీంతో నామినేషన్ల సంఖ్య నాలుగుకు చేరినట్లు రిటర్నింగ్ ఆఫీసర్ వెల్లడించారు.

వరంగల్ 'తూర్పు'లో..

వరంగల్ అర్బన్: వరంగల్ తూర్పు నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థిగా సంద్ర జాన్సన్ వరంగల్ మహా నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి, కమిషనర్ షేక్‌రిజ్వాన్‌బాషాకు నామినేషన్ అందించారు. ఇప్పటివరకు నియోజకవర్గంలో ఆరుగురు అభ్యర్థులు 7 నామినేషన్లు దాఖలు చేశారు.

పరకాలలో రెండు..

పరకాల: పరకాలలో మంగళవారం రెండు నామినేషన్లు దాఖలైనట్లు ఆర్‌ఓ శ్రీనివాస్ తెలిపారు. బీజేపీ అభ్యర్థి డాక్టర్ పగడాల కాళీప్రసాద్‌రావు, ధర్మారం గ్రామానికి చెందిన స్వతంత్ర అభ్యర్థి అందె కుమారస్వామి నామినేషన్లు వేశారు. దీంతో పరకాలలో మొత్తం 9 నామినేషన్లు దాఖలయ్యాయి.

పాలకుర్తిలో..

పాలకుర్తి నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థిగా మహబూబాబాద్ జిల్లా శనిగరానికి చెందిన మాధవరెడ్డి వెంకట్‌రెడ్డి మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు.

పోస్టల్ కబడ్డీ పోటీల్లో కాంస్య పతకం



అక్రమ్‌ఖాన్‌ను అభినందిస్తున్న హెడ్‌పోస్టాఫీస్ సూపరింటెండెంట్, తదితరులు

హన్మకొండ: కర్ణాటకలో అక్టోబర్ 30 నుంచి నవంబర్ 4 వరకు జరిగిన 35వ ఆల్ ఇండియా పోస్టల్ డిపార్ట్‌మెంట్ కబడ్డీ టోర్నమెంట్‌లో తెలంగాణ జట్టు ప్రతిభ కనబరిచి కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. కాగా, తెలంగాణ జట్టుకు హనుమకొండలోని బొక్కలగడ్డకు చెందిన మహ్మద్ అక్రమ్‌ఖాన్ కెప్టెన్‌గా వ్యవహరించారు. హనుమకొండలోని హెడ్‌పోస్టాఫీస్‌లో ఆయన పోస్టల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ సందర్భంగా మంగళవారం అక్రమ్‌ఖాన్‌ను సూపరింటెండెంట్ హనుమంతునాయక్, పోస్ట్‌మాస్టర్ సుబ్రహ్మణ్యం, ఏపీఎం జె.కుమారస్వామి అభినందించారు.

'తొలిమెట్టు' పరిశీలన

విద్యారణ్యపురి: హనుమకొండలోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ ప్రాథమిక పాఠశాలను మంగళవారం పాఠశాల విద్యాశాఖ ఆర్‌జేడీ సత్యనారాయణరెడ్డి సందర్శించారు. విద్యార్థుల కోసం అమలు చేస్తున్న తొలిమెట్టు కార్యక్రమాన్ని పరిశీలించారు. అంతేకాకుండా ఐదో తరగతిలో గణిత సబ్జెక్టును టీచర్ బోధిస్తుండగా.. ఆర్‌జేడీ సత్యనారాయణరెడ్డి తరగతి గదిలో కూర్చొని విన్నారు. బోధన విధానం ఎలా ఉంది, విద్యార్థులు ఏ మేరకు అర్థం చేసుకుంటున్నారు.. అనే వివరాలను తెలుసుకున్నారు. నాలుగో తరగతి విద్యార్థులతో మాట్లాడారు.

అన్ని వాహనాలను తనిఖీ చేయాలి

- కలెక్టర్ సిక్తాపట్నాయక్



ఆత్మకూరు : కటాక్షపూర్ చెక్‌పోస్టు వద్ద రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ సిక్తాపట్నాయక్

ఆత్మకూరు/నడికూడ/దామెర: పోలీస్ సిబ్బంది చెక్‌పోస్టుల వద్ద అన్నిరకాల వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని కలెక్టర్ సిక్తాపట్నాయక్ ఆదేశించారు. ఆత్మకూరు మండలంలోని కటాక్షపూర్, నడికూడ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులను మంగళవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరకాల నియోజకవర్గంలో 3 చెక్‌పోస్టులు, 9 స్టాటిస్టిక్ సర్వేలెన్స్ టీంలు, 9 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు 9 పనిచేస్తున్నాయని తెలిపారు. ఎలాంటి ఆధారాలు లేకుండా నగదు తీసుకెళ్తే చర్యలు తీసుకోవాలని, వాహనాలకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని సంబంధిత రిజిస్టర్లలో నమోదు చేయాలని సూచించారు. ఆమె వెంట అదనపు కలెక్టర్ సిక్తాపట్నాయక్, నడికూడ మండల రిటర్నింగ్ అధికారి పుల్లా అవినాశ్ ఉన్నారు. అదేవిధంగా కలెక్టర్ దామెర మండలంలోని దుర్గంపేట పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి మాట్లాడారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. 80 సంవత్సరాలు పైబడిన వారు ఇంటి వద్దే ఓటు హక్కు వినియోగించుకునే విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో వంద శాతం ఓటు నమోదు అయ్యే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ఈ నెల 10 నుంచి ఓటర్లకు పోలింగ్ చిట్టీలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ జ్యోతివరలక్ష్మీదేవి, ఆర్ఐ భాస్కర్ రెడ్డి ఉన్నారు.

'సౌత్‌జోన్' పోటీలకు కేడీసీ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రాజారెడ్డి, అధ్యాపకులు

విద్యారణ్యపురి: కాకినాడలోని జేఎన్‌టీయూలో ఈనెల 9 నుంచి 12 వరకు నిర్వహించనున్న సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ కబడ్డీ పోటీలకు కాకతీయ యూనివర్సిటీ జట్టులో ముగ్గురు కేడీసీ విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ జి.రాజారెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ జె.సోమన్న తెలిపారు. శివాజీ (బీఏ ఫైనల్ ఇయర్), యువరాజు (బీఏ ఫైనల్ ఇయర్), దావన్ (బీఎస్సీ ఎంపీసీ సెకండియర్) ఎంపికయ్యారని వారు పేర్కొన్నారు. ఈమేరకు మంగళవారం హనుమకొండలోని కేడీసీలో ముగ్గురు విద్యార్థులను ప్రిన్సిపాల్, పీడీతోపాటు గేమ్స్ కమిటీ బాధ్యులు కమలాకర్, ఎ.సంజీవయ్య, సోమనర్సయ్య, వెంకటేష్, సత్యనారాయణ, వినోద్‌రావు, విజయపాల్‌రెడ్డి అభినందించారు.

నియోజకవర్గాల వారీగా దాఖలైన నామినేషన్ల వివరాలు (తేదీ : 07-11-2023 వరకు)

నియోజకవర్గం	బీఆర్ఎస్	కాంగ్రెస్	బీజేపీ	ఇతరులు
వరంగల్ తూర్పు	-	-	01	06
వరంగల్ పశ్చిమ	-	01	01	02
జనగామ	01	01	-	05
పాలకుర్తి	02	-	-	04
స్టేషన్‌ఘన్‌పూర్	-	01	-	04
జేఎస్.భూపాలపల్లి	-	01	01	05
ములుగు	-	-	-	02
నర్సంపేట	-	-	01	07
వర్ధన్నపేట	-	01	01	02
పరకాల	-	-	01	08
మహబూబాబాద్	-	-	-	02
డోర్నకల్	-	-	-	03

ఈ ముచ్చటేందో?

సహాయకులుగా ఒక్కరికి ఒక్కసారే అవకాశం..

కాజీపేట: ఈ నెల 30వ తేదీన జరుగనున్న తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు వేయడానికి పోలింగ్ కేంద్రాలకు వచ్చే దివ్యాంగులు, అంధులకు సహాయకులుగా ఉండడానికి ఒక్కరికి ఒక్కసారే అవకాశం ఉంది. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. సహాయకులుగా వెళ్లే వారికి కూడా అధికారులు సిరా చుక్క గుర్తు వేస్తారు. దీని వల్ల వారు తిరిగి తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తవు. కాగా, ఓటర్లకు ఎడమ చూపుడు వేలికి సిరా చుక్క గుర్తు వేస్తున్న విషయం తెలిసిందే. సహాయకుడికి మాత్రం కుడి చేయి చూపుడు వేలుకు సిరా చుక్క గుర్తు వేస్తారు.


జంగ్ తెలంగాణ

నవ్వుల్.. పువ్వుల్..



ఒకరు ప్రతిపక్షం.. మరొకరు అధికార పక్షం.. ఎప్పుడు చూసిన ఒకరిపై ఒకరు విమర్శనాస్త్రాలు.. ఎదురు పడినా మాట్లాడుకునే వారు కాదు. ఇలాంటి వారు ఇటీవల మిత్రులయ్యారు. వారే జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య. పొన్నాల ఇటీవల కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్‌లో చేరడంతో శత్రువులు కాస్తా మిత్రులయ్యారు. మంగళవారం బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి నామినేషన్ సందర్భంగా ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి.. పొన్నాలకు కండువా కప్పి సరిచేస్తుండగా అక్కడే ఉన్న బోడకుంటి వెంకటేశ్వర్లు, పల్లా, పార్టీ శ్రేణుల్లో నవ్వులు విరబూశాయి. - జనగామ

దేశానికి కలంకం తెచ్చేవారు జీవించడానికి అనర్హులు.
- జవహర్‌లాల్ నెహ్రూ



ఓటరు మాట .. 'నోటా'


- 2018లో నోటాకు 33, 358 ఓట్లు
- వర్ధన్నపేట టాప్
- భారీగా నమోదవుతున్న ఓటింగ్ శాతం



నియోజకవర్గాల వారీగా గత సాధారణ ఎన్నికల్లో నోటాకు పోలైన ఓట్లు	
నియోజకవర్గం	నోటాకు పడిన ఓట్లు (2018)
వరంగల్ పశ్చిమ	3,075
వరంగల్ తూర్పు	2,716
వర్ధన్నపేట	5,864
పరకాల	2,064
స్టేషన్‌ఘన్‌పూర్	3,540
పాలకుర్తి	1,078
జనగామ	2,616
మహబూబాబాద్	3,279
డోర్నకల్	2,036
నర్సంపేట	2,442
భూపాలపల్లి	1,399
ములుగు	3,249
మొత్తం	33,358

హన్మకొండ అర్బన్: పోలింగ్ శాతం పెంపు లక్ష్యంగా ఎన్నికల కమిషన్ తీసుకొచ్చిన నోటాకు కొన్ని నియోజక వర్గాల్లో భారీగా ఓట్లు నమోదవుతున్నాయి. జిల్లాలోని 12 శాసన సభ నియోజకవర్గాల్లో 2018 సాధారణ ఎన్నికల్లో నోటాకు భారీగా ఓట్లు పడ్డాయి. మొత్తం 33, 358ఓట్లు పడగా వాటిలో అత్యధికంగా వర్ధన్నపేట నియోజకవర్గం నుంచి 5,864 ఓట్లు ఉండడం విశేషం. ఆ తరువాత స్థానంలో స్టేషన్ ఘన్‌పూర్ నుంచి 3,540 ఓట్లు పడ్డాయి. పాలకుర్తిలో తక్కువగా 1,078 ఓట్లు పోలయ్యాయి. తరువాత భూపాలపల్లిలో 1,399 ఓట్లు పోలయ్యాయి.

ఆరోవంతు ఓట్లొస్తేనే డిపాజిట్..



హన్మకొండ అర్బన్: నియోజకవర్గంలో పోలైన మొత్తం ఓట్లలో ఆరోవంతు (16.66%) ఓట్లు వస్తేనే ఆ అభ్యర్థికి డిపాజిట్ దక్కినట్లు లెక్క. అభ్యర్థి నామినేషన్ వేసే సమయంలో చెల్లించే డబ్బును డిపాజిట్ అంటారు. ఓట్లలో డిపాజిట్ దక్కిచుకున్న వారికి లెక్కింపు అనంతరం సదరు అభ్యర్థి ఓడిపోయినా డిపాజిట్ తిరిగి ఇస్తారు. దీనినే డిపాజిట్ (ధరావత్తు) దక్కిచుకోవడం అంటారు.

గ్రౌండ్ రిపోర్ట్ పరకాల

పోరు గడ్డ పరకాల ప్రజలు సమస్యలతో సవాసం చేస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నిరాదరణకు గురైన ఈ నియోజకవర్గం స్వరాష్ట్రంలో ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతోంది. గత ప్రభుత్వాలు అభివృద్ధి చేసినప్పటికీ చేయాల్సిన పనులు ఇంకా ఉన్నాయి. ఈ నేపథ్యంలో కాబోయే ఎమ్మెల్యేకు పలు సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. పరకాల నియోజకవర్గంలో పరకాల పట్టణంతో పాటు, పరకాల, నడికూడ, ఆత్మకూరు, దామెర, గీసుకొండ, సంగెం మండలాలు ఉన్నాయి. ఈ నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలపై 'సాక్షి' ప్రత్యేక కథనం. - ఆత్మకూరు



బ్రిడ్జి నిర్మించాల్సిన ఎల్లూరు రంగంపేట చెరువు

పరకాల.. అభివృద్ధి వెనకాల..

సంగెం మండలంలో..

సంగెం-చింతలపల్లి మధ్యలో వరంగల్-విజయవాడ రైల్వే ఓవర్‌బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు నిర్మాణ జాప్యం వల్ల నిరుద్యోగులు ఉపాధి అవకాశాల కోసం వేయి కండ్లతో ఎదురుచూస్తున్నారు. కాట్రపల్లి-వెంకటాపూర్, చింతలపల్లి-పల్లారుగూడ, మొండ్రాయి-పల్లారుగూడ, మొండ్రాయి-నల్లబెల్లి మధ్యలో లోలెవల్ కాజ్‌వేల నిర్మాణం లేకపోవడంతో వానాకాలంలో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని ఎల్లూరురంగంపేట చెరువు మత్తడిపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి. మండలంలో డిగ్రీకళాశాల ఏర్పాటు చేయాలి. ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని అప్‌గ్రేడ్ చేయాలి. చెరువులు, కుంటలకు గేట్లు ఏర్పాటు చేయాలి. పంట కాల్వలకు లైనింగ్ ఏర్పాటు చేయాలి. గురుకుల పాఠశాలలకు పక్కాభవనాలు నిర్మించాలి.

నియోజకవర్గంలో పలు సమస్యల తిష్ట..

- 'సాక్షి' గ్రౌండ్ రిపోర్ట్‌లో పలు విషయాలు వెలుగులోకి..
- కాబోయే ఎమ్మెల్యేకు సమస్యల స్వాగతం..

ప్రభుత్వ డిగ్రీకళాశాల భవనం



పరకాల మండలంలో..

నిధులు లేక శిథిలావస్థలో జీపీ భవనాలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు మంజూరు చేయకపోవడంతో గ్రామ పంచాయతీ కార్యాలయాలు శిథిల భవనాల్లోనే కొనసాగుతున్నాయి. దీంతో కొందరు సర్పంచ్‌లు తమ నివాసాలనే కార్యాలయాలుగా మార్చుకుని సిబ్బందితో సమావేశమవుతున్నారు.



పాఠశాలలో నడుస్తున్న పైడిపల్లి జీపీ భవనం

హామీలు నెరవేర్చలేకపోతున్నాం



పైడిపల్లి గ్రామ పంచాయతీకి మొదటి సర్పంచ్ అయ్యాయని గర్వంగా ఉన్నా.. నిధుల కొరత బాధగా ఉంది. నిధులు కొరతతో ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేకపోతున్నాం. రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థను నిర్మించుకోలేకపోతున్నాం. గ్రామ పంచాయతీ భవనానికి రూ.12 లక్షలతో ప్రతిపాదనలు పంపినా చిల్లీ గవ్వ రాలేదు.
- అడ్డికిల సరిత, సర్పంచ్, పైడిపల్లి

ఆత్మకూరు మండలంలో..

మండలంలోని కటాక్షపూర్ చెరువు వద్ద జాతీయ రహదారిపై హైలెవల్ వంతెన నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ఈ వంతెన నిర్మాణం కాకపోవడంతో వర్షాకాలంలో రాకపోకలు నిలిచిపోతున్నాయి. అలాగే, మండలంలో ఎంజేపీ, సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలకు సొంతభవనాలు నిర్మించాల్సి ఉంది. మండలంలో డిగ్రీ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేయాలని స్థానికుల డిమాండ్.



కటాక్షపూర్ చెరువుపై నుంచి వెళ్తున్న ఎన్‌హెచ్

పరకాల పట్టణంలో..

పరకాల పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సొంత భవనం లేదు. ఫలితంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలోనే కొనసాగిస్తున్నారు. 10 సంవత్సరాల క్రితమే సర్వే నంబర్ 973లోని ప్రభుత్వ భూమిని డిగ్రీ కళాశాల నిర్మాణానికి కేటాయించినా నిధులు లేకపోవడంతో కాలయాపన జరిగింది. 2023 అక్టోబర్‌లో రూ.13 కోట్ల నిధులు మంజూరు కాగా ఎన్నికల కోడ్ రావడంతో శంకుస్థాపన పనులకు బ్రేక్ పడింది.

అసంపూర్తిగా ట్యాంక్‌బండ్ పనులు

పరకాల పట్టణంలోని దామెర చెరువు ట్యాంక్ బండ్ నిర్మాణ పనులు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. అదనపు నిధుల మంజూరులో జాప్యం జరగడంతో పనులకు అంతరాయం ఏర్పడింది. ఇప్పటికే రూ.4.50 కోట్లు ఖర్చు చేసినా ట్యాంక్ బండ్ నిర్మాణం ఇంకా పూర్తి కాకపోవడంపై ప్రజలు నిరాశ చెందుతున్నారు.

డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానం

నిధుల కొరత కారణంగా పరకాల మున్సిపాలిటీ పరిధిలో అంతర్గత డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానంగా మారింది. చాలా కాలనీల్లో డ్రెయినేజీల నిర్మాణం లేక మురుగునీరు రోడ్లపైకి ప్రవహిస్తోంది. అలాగే, కాలనీల్లో సీసీ రోడ్లు మంజూరైనా నిధుల కొరతతో పనులకు ఆటంకం కలుగుతోంది.

జాడలేని మినీ స్టేడియం

పరకాల పట్టణంలో 15 ఏళ్ల క్రితం మంజూరైన మినీ స్టేడియం పనులు జాడలేకపోవడంతో క్రీడాకారులు తీవ్ర నిరాశ చెందుతున్నారు. స్టేడియానికి 5 ఎకరాల స్థలం కేటాయించినా పనులు ప్రారంభం కాకపోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నిస్తున్నారు.

దామెర మండలంలో..

దామెర మండలంలో మండల పరిషత్ కార్యాలయం, పోలీసుస్టేషన్‌కు నూతన భవనాలు నిర్మించాల్సి ఉంది. అలాగే, మండల వ్యాప్తంగా పూర్తిస్థాయిలో మిషన్‌భగీరథ జలాలు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

నడికూడ మండలంలో..

నడికూడ మండల కేంద్రంలో ఆరోగ్య ఉప కేంద్రం అద్దె భవనంలో కొనసాగుతోంది. పక్కా భవనం నిర్మించాల్సి ఉంది. అలాగే, పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయాలి. మండలంలోని కంఠాత్మకూరు వాగుపై బ్రిడ్జి నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.


గీసుకొండ మండలంలో..

గీసుకొండ మండలం కోనాయమాకులలో ఎత్తిపోతల పథక పనులను పూర్తి చేయాల్సి ఉంది. టెక్స్‌టైల్ పార్కు కోసం భూములు ఇచ్చిన రైతులు ఇంటిస్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. మండలంలో రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

చలివాగుపై వంతెన నిర్మించాలి



పరకాల మండలంలోని చలివాగుపై వంతెన లేకపోవడంతో వర్షాకాలంలో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. 5 వందల ఎకరాల ఆయకట్టు కలిగిన ఈ వాగుపై వంతెన నిర్మించాలని ఎన్నో సంవత్సరాలుగా కోరుతున్నాం. అయినా పాలకులు పట్టించుకోవడం లేదు. కాబోయే పాలకులైనా స్పందించి సమస్య పరిష్కరించాలి.
- పిట్ట వీరస్వామి, పరకాల



రూ.14.17 లక్షల నగదు జప్తు..



మహబూబాబాద్ రూరల్: రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుడి బ్యాగు తనిఖీ చేస్తున్న పోలీసులు



డోర్నకల్: నగదు స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు, ఎన్నికల అధికారులు

ఎన్నికల కోడ్ నేపథ్యంలో పోలీసులు విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆధారం లేకుండా తరలిస్తున్న నగదు, బంగారం, వెండి, ఇతర ఆస్తులను స్వాధీనం చేసుకుంటున్నారు. ఇందులో భాగంగా మంగళవారం ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా తనిఖీలు నిర్వహించి రూ. 14.17 లక్షల నగదును జప్తు చేశారు.

మానుకోటలో రూ.5.79 లక్షలు

మహబూబాబాద్ రూరల్ : జిల్లా కేంద్రంలో మంగళవారం పోలీసులు, ఎన్నికల అధికారులు విస్తృత తనిఖీలు జరిపారు. ఈ సందర్భంగా గార్ల నుంచి మహబూబాబాద్ వస్తున్న రవి అనే వ్యక్తి వద్ద రైల్వే స్టేషన్‌లో రూ.4,69,700 నగదు స్వాధీనం చేసుకున్నారు. అలాగే, దేవేందర్ వద్ద రూ.1,10,000 స్వాధీనం చేసుకున్నారు. మొత్తం రూ.5,79,700 నగదు సీజ్ చేసి ఆర్డీఓ కార్యాలయంలో అప్పగించామని అధికారులు తెలిపారు.

దంతాలపల్లిలో 1.79 లక్షలు..

దంతాలపల్లి: దంతాలపల్లి మండల కేంద్రంలో మంగళవారం 1.79 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నామని ఎస్సై చిర్ర రమేశ్ తెలిపారు. మండలంలోని రామానుజపురం గ్రామానికి చెందిన మహిపాల్‌రెడ్డి తన ద్విచక్రవాహనంలో ఆధారం లేకుండా తరలిస్తున్న 1.79 లక్షల నగదును పట్టుకున్నామని ఎస్సై పేర్కొన్నారు.

డోర్నకల్‌లో రూ.1.65 లక్షలు..

డోర్నకల్: డోర్నకల్ చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు మంగళవారం రూ.1.65 లక్షల నగదును పట్టుకున్నారు. కామేపల్లి మండలం బంజరకు చెందిన రైతు భద్రు బొలెరో వాహనంలో ఆధారం లేకుండా తరలిస్తున్న రూ.1.65 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం స్వాధీనం చేసుకున్న నగదుకు రశీదు అందించారు.

కాంపల్లిలో రూ.1.44 లక్షలు..

కురవి: సీరోలు మండలం కాంపల్లి స్టేజీ వద్ద మంగళవారం రూ.1.44 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నామని సీరోలు ఎస్సై రమాదేవి తెలిపారు. సూర్యాపేట జిల్లాకు చెందిన బడుపుల గోవిందరాజుతోపాటు మరో వ్యక్తి ట్రాలీ ఆటోలో ఆధారం లేకుండా తరలిస్తున్న రూ.1.44 లక్షల నగదును పట్టుకుని సీజ్ చేశామని ఎస్సై పేర్కొన్నారు.

నర్సింహులపేటలో రూ. 3.50 లక్షలు..

నర్సింహులపేట: మండల కేంద్రంలోని పెట్రోల్ బంక్ వద్ద మంగళవారం రూ. 3.50 లక్షలు స్వాధీనం చేసుకున్నామని ఎస్సై గండ్రాతి సతీష్ తెలిపారు. నర్సింహులపేటకు చెందిన ఓ వ్యక్తి వాహనంపై ఆధారం లేకుండా తరలిస్తున్న నగదును స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

'పల్లా' ఆస్తులు రూ.22 కోట్లు..

- అప్పు రూ.5.68కోట్లు
- ఎన్నికల అఫిడవిట్‌లో వెల్లడి



పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ: బీఆర్ఎస్ జనగామ ఎమ్మెల్యే అభ్యర్థిగా పల్లా రాజేశ్వర్‌రెడ్డి మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా అఫిడవిట్‌లో తను, తన భార్య పేరుతో ఉన్న స్థిర, చర ఆస్తులు, అప్పులు, ఆదాయ మార్గాలకు సంబంధించి వివరాలు వెల్లడించారు. ఆ వివరాల ప్రకారం..

- రాజేశ్వర్‌రెడ్డి, తన సతీమణి నీలిమ పేరిట గృహాలు, ఖాళీ స్థలాలు, వ్యవసాయ భూములు, ఎల్ఐసీ పాలసీలు, వ్యాపార సంస్థలు, షేర్లు, బంగారం, వెండి ఆభరణాలు, వాహనాలతో కలిపి ఆస్తులు రూ. 22.62 కోట్లు, అప్పు రూ.5. 68 కోట్లు ఉంది.

వారసత్వంగా వచ్చిన ఆస్తుల విలువ :

- రూ.18 లక్షల 99వేలు

పల్లా రాజేశ్వర్‌రెడ్డి బ్యాంకు ఖాతాలు :

- హైదరాబాద్‌లో ఎస్‌బీఐ (అశోక్‌నగర్, సెక్రటేరియట్ బ్రాంచ్. ఉప్పల్ ఐసీఐసీఐ బ్యాంకుతో కలిపి నాలుగు ఖాతాలు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ఖర్చు నిమిత్తం జనగామ హెచ్‌డీఎఫ్‌సీలో నూతన అకౌంట్ ఓపెన్ చేశారు.

రాజేశ్వర్‌రెడ్డి భార్య నీలిమ బ్యాంకు ఖాతాలు :

- హైదరాబాద్ అశోక్ నగర్ ఎస్‌బీఐలో రెండు, యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియాలో మరో ఖాతా ఉంది.

పల్లా రాజేశ్వర్‌రెడ్డి పేరిట షేర్లు :

- నీలిమ హాస్పిటల్‌లో రూ.5.25 కోట్ల విలువైన షేర్లు ఉన్నాయి.

నీలిమ పేరిట షేర్లు :

- రూ.1.26 కోట్ల విలువైన షేర్లు ఉన్నాయి.

ఎల్ఐసీ :

- ఎల్ఐసీలో ఇద్దరు దంపతుల పేరిట రూ.50 లక్షల చొప్పున రూ. కోటి బీమా పాలసీ ఉంది.

వాహనాలు :

- వాల్వో, ఎక్సీ/బీ6/ఎసీయూవీ వాహనాలు రాజేశ్వర్‌రెడ్డి ఉపయోగిస్తుండగా, మారుతి సెలోరియో కారు నీలిమ వద్ద ఉంది.

భూములు :

- హనుమకొండ జిల్లా వేలేరు మండలం షోడాషపల్లి, మల్లికుదుర్ల గ్రామాల్లో రాజేశ్వర్‌రెడ్డి పేరిట 30 ఎకరాల 25 గుంటల వ్యవసాయ భూమి, భార్య నీలిమ పేరిట 10 ఎకరాల 13 గుంటలు.

పోలీసు కేసులు :

- ఇప్పటి వరకు ఎలాంటి క్రిమినల్ కేసులు నమోదు కాలేదని జనగామ ఆర్ఓ మురళీకృష్ణకు ఇచ్చిన అఫిడవిట్‌లో రాజేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు.

పాము కాటుతో చిన్నారి మృతి

నర్సంపేట రూరల్ : పాముకాటుతో ఓ చిన్నారి మృతి చెందింది. ఈ ఘటన నర్సంపేట మండలం భోజ్యానాయక్‌తండాలో జరిగింది. తండాకు చెందిన నూనావత్ వీరన్న, కమల దంపతులకు ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. చిన్న కూతురు శిరీష (5) మాదన్నపేట ప్రాథమిక పాఠశాలలో ఒకటవ తరగతి చదువుతోంది. ఈ క్రమంలో శిరీష మంగళవారం ఇంటివద్దే ఉంది. ఇంటి ఆవరణలో ఆడుకుంటుండగా పాము కాటువేసింది. వెంటనే కుటుంబీకులు గమనించి నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి చిన్నారి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. కాగా, చిన్నారి శిరీష మృతితో తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి.



శిరీష (ఫైల్)

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	16	64,942
నిఫ్టీ ▽	5	19,407

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	13,615	△	93
డోజోన్స్	34,141	△	45
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,410	▽	8
డాక్స్	15,153	△	17
షాంఘై	3,057	▽	1
నికాయ్	32,708	▽	448

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో) ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	60,579	▽	474
బంగారం (99.5 స్వచ్ఛత)	60,336	▽	472
వెండి (కేజీ)	72,705	▽	1,332

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎకటం	82.48	84.15
£	బ్రిటన్ పౌండ్	ఎకటం	99.99	103.36
€	యూరో	ఎకటం	87.01	90.10
¥	జపాన్ ఎన్ (100)	ఎకటం	54.58	56.26
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎకటం	52.53	54.84
S$	సింగపూర్ డాలర్	ఎకటం	60.20	62.14
SAR	సౌదీ రియాల్	[illegible]	21.19	22.82
UAE D	యూఏఈ దిర్హామ్	[illegible]	21.65	23.49
¥	చైనా యువాన్	[illegible]	10.29	12.38

స్వల్పంగా పెరిగిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రుణ రేటు



ముంబై: హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ కొన్ని కాలప రిమితుల రుణాలపై వడ్డీ రేటును స్వల్పంగా 0.05 శాతం (ఐదు బేసిస్ పాయింట్లు) పెంచింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గడచిన ఐదు ద్వైమాసిక ద్రవ్య పరపతి విధాన సమీక్షల్లోనూ రెపో రేటు (బ్యాంకులకు తానిచ్చే రుణాలపై ఆర్‌బీఐ వసూలు చేసే వడ్డీరేటు– ప్రస్తుతం 6.5%) పెంపుపై ఎటువంటి నిర్ణయం తీసుకోనప్పటికీ, హెచ్‌డీఎఫ్‌సీ తాజా రేటు పెంపు నిర్ణయం తీసుకుంది. దీని ప్రకారం, ఓవర్‌నైట్ ఎంసీఎల్‌ఆర్ 8.65 శాతానికి పెరిగింది. మూడేళ్ల ఎంసీఎల్‌ఆర్ 9.30 శాతానికి ఎగసింది. కాగా, సాధారణంగా అధిక రుణాలకు ప్రాతిపదిక అయిన ఏడాది రుణ రేటు మాత్రం 9.20 శాతం వద్ద స్థిరంగా ఉంది.

హైదరాబాద్‌లో రిలయన్స్ స్వదేశ్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: రిటైల్ రంగ దిగ్గజం రిలయన్స్ రిటైల్ 'స్వదేశ్' తొలి ఔట్‌లెట్‌ను హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో ఏర్పాటు చేసింది. రిలయన్స్ ఫౌండేషన్ ఫౌండర్, చైర్‌పర్సన్ నీతా అంబానీ చేతుల మీదుగా నేడు (బుధవారం) ఈ స్టోర్ ప్రారంభం కానుంది. సుమారు 30,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇది కొలువుదీరింది. చేనేత వస్త్రాలు, హస్తకళలు, ఫర్నిచర్, బొమ్మలు, ఆభర ణాలు, గృహాలంకరణ వస్తువులు, పెయింటింగ్స్, యాక్సెసరీస్‌తోపాటు వ్యవసాయ ఉత్పత్తులను ఇక్కడ విక్రయిస్తారు. దేశవ్యాప్తంగా చేతి వృత్తుల కళాకారులకు చెందిన గుర్తింపు ఉన్న సంఘా ల నుంచి నేరుగా వీటిని సేకరిస్తారు. రూ.6 లక్షలకుపైగా ధర పలికే వస్తువులనూ విక్రయిస్తారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

08-11-2023	
విశాఖ	530-00
చిత్తూరు	593-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	525-00
విజయవాడ	525-00
రిటైల్ ధర (డజను)	72.00
07-11-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	515-00
వరంగల్	517-00
రిటైల్ ధర	5.75

వుయ్‌వర్క్ దివాలా!

- వ్యాపార పునర్‌వ్యవస్థీకరణపై దృష్టి
- లీజుల క్రమబద్ధీకరణకు కసరత్తు



న్యూయార్క్: ఆఫీస్ స్పేస్ విభాగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన అంతర్జాతీయ దిగ్గజం వుయ్‌వర్క్ దివాలా ప్రకటించింది. వ్యాపారాన్ని యథా ప్రకారం కొనసాగిస్తూ, కార్యకలాపాలను పునర్‌వ్యవస్థీకరించుకునే దిశగా అమెరికాలో చాప్టర్ 11 దివాలా పిటిషన్ దాఖలు చేసింది. వ్యాపార పునర్నిర్మాణ ప్రక్రియ ప్రారంభించినట్లు కంపెనీ తెలిపింది. కమర్షియల్ ఆఫీస్ లీజుల పోర్ట్‌ఫోలియోను మరింత క్రమబద్ధీకరించుకోనున్నట్లు పేర్కొంది. రుణభారాన్ని గణనీయంగా తగ్గించుకునే దిశగా పునర్‌వ్యవస్థీకరణ విషయంలో తోడ్పాటు అందించేలా సంబంధిత వాటాదారులతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపింది. అమెరికా, కెనడా వెలుపలి దేశాల్లోని తమ కార్యకలాపాలపై ఈ పరిణామ ప్రభావం ఉండబోదని వుయ్‌వర్క్ వివరించింది. సమస్యలను పరిష్కరించుకుని, వ్యాపారాన్ని మెరుగుపర్చుకుంటూ ముందుకు సాగడంపై దృష్టి పెడుతున్నట్లు సంస్థ సీఈవో డేవిడ్ టోలీ ఒక ప్రకటనలో తెలిపారు. కంపెనీ ఈ ఏడాది ప్రథమార్ధంలో 696 మిలియన్ డాలర్ల నష్టం నమోదు చేసింది. జూన్ 30 నాటికి వుయ్‌వర్క్‌కు 39 దేశాల్లో 777 చోట్ల కార్యకలాపాలు ఉన్నాయి.

అప్పట్లో 50 బిలియన్ డాలర్ల వేల్యుయేషన్ ..


గతంలో దాదాపు 50 బిలియన్ డాలర్ల వేల్యుయేషన్‌తో వెలుగొందిన వుయ్‌వర్క్ దివాలా తీయడానికి అనేక కారణాలు ఉన్నాయి. అతి దూకుడుగా విస్తరించడం, వ్యవస్థాపకుడు ఆడమ్ న్యూమాన్ పోకడలు మొదలైనవి ఇందుకు దారితీశాయి. వాస్తవానికి కొన్నాళ్ల క్రితం నుంచే దివాలా సంకేతాలు కనిపించడం మొదలైంది. 2019లో తొలి పబ్లిక్ ఇష్యూ ప్రయత్నం ఘోరంగా విఫలం కాగా ఆ తర్వాత 2021లో ఐపీవోకి వచ్చినా వేల్యుయేషన్ అనేక రెట్లు తగ్గి 9 బిలియన్ డాలర్లకు పడిపోయింది. అంతకన్నా ముందే కంపెనీ, వ్యవస్థాపకుడి పనితీరుపై ఇన్వెస్టర్లలో తీవ్ర అసంతృప్తి నెలకొనడంతో.. న్యూమాన్ ఉద్వాసనకు గురయ్యారు. సంస్థలో మెజారిటీ వాటాలు తీసుకున్న జపాన్ దిగ్గజం సాఫ్ట్‌బ్యాంక్.. కంపెనీని నిలబెట్టేందుకు ప్రయత్నించింది. నిర్వహ ణ వ్యయాలను తగ్గించుకోవడం, ఆదాయాన్ని పెంచుకోవడం వంటి ప్రయత్నాలు జరిగినా పెద్దగా ఫలితం లేకపోయింది. వ్యాపారాన్ని కొనసాగించే సామర్థ్యాలు అంతంతమాత్రంగానే ఉన్నాయంటూ వుయ్‌వర్క్ ఆగస్టులోనే వెల్లడించింది. ఆ తర్వాత లీజులన్నింటినీ పునఃసమీక్షించుకునే యోచనలో ఉన్నట్లు సెప్టెంబర్‌లో ప్రకటించింది. నష్టాల్లో ఉన్న లొకేషన్ల నుంచి వైదొలగనున్నట్లు తెలిపింది.

భారత్‌లో ప్రభావం ఉండదు..

వుయ్‌వర్క్ గ్లోబల్ దివాలా ప్రభావం భారత విభాగంపై ఉండదని వుయ్‌వర్క్ ఇండియా సీఈవో కరణ్ విర్వాణి స్పష్టం చేశారు. దివాలా ప్రక్రియలో భారత వ్యాపారం భాగంగా లేదని తెలిపారు. వుయ్‌వర్క్ ఇండియాలో రియల్ ఎస్టేట్ సంస్థ ఎంబసీ గ్రూప్‌నకు 73 శాతం, వుయ్‌వర్క్ గ్లోబల్‌కు 27 శాతం వాటాలు ఉన్నాయి. భారత్‌లో ఏడు నగరాల్లో వుయ్‌వర్క్ ఇండియాకు 50 కేంద్రాలు ఉన్నాయి. 2021 జూన్‌లో వుయ్‌వర్క్ ఇండియాలో వుయ్‌వర్క్ గ్లోబల్ 100 మిలియన్ డాలర్లు ఇన్వెస్ట్ చేసింది.

బ్యాంకింగ్‌కు ప్రత్యామ్నాయంగా ఫిన్‌టెక్


'ఆర్‌బీఐ' నివేదిక



ముంబై: సమీప భవిష్యత్తులో సాంప్రదాయ బ్యాంకింగ్‌కు ఫిన్‌టెక్ రంగం ప్రత్యామ్నాయంగా ఎదిగే అవకాశాలు ఉన్నాయని సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ ఫైనాన్షియల్ రీసెర్చ్ అండ్ లెర్నింగ్ (కెఫ్రాల్) ఒక నివేదికలో పేర్కొంది. డిజిటలీకరణ వృద్ధికి, ఆర్థిక స్థిరత్వ సాధనకు ఎప్పటికప్పుడు తగు విధంగా మల్చుకోగలిగే నియంత్రణ విధానాలు అవసరమని తెలిపింది. ఇండియా ఫైనాన్స్ రిపోర్ట్ 2023 పేరిట కెఫ్రాల్ రూపొందించిన తొలి ప్రచురణను రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ శక్తికాంత దాస్ మంగళవారం విడుదల చేశారు. బ్యాంకింగ్, ఫైనాన్స్ రంగంలో పరిశోధనలను ప్రోత్సహించేందుకు 2011లో కెఫ్రాల్‌ను లాభాపేక్ష రహిత సంస్థగా ఆర్‌బీఐ ఏర్పాటు చేసింది. దేశీయంగా బ్యాంకిగేతర ఆర్థిక రంగ స్థితిగతులను అర్థం చేసుకోవడంలో నియంత్రణ సంస్థలు, విధాన నిర్ణేతలు సహా సంబంధిత వర్గాలకు సహాయకరంగా ఉండే అంశాలను తాజా నివేదికలో పొందుపర్చారు. దేశీ సాంకేతిక తోడ్పాటుతో భారత్‌లో డిజిటలీకరణ వేగవంతమవుతోందని, డిజిటల్ రుణాలు.. ముఖ్యంగా ఫిన్‌టెక్ రుణాలు గణనీయంగా పెరిగాయని నివేదిక పేర్కొంది.

పవర్ గ్రిడ్ లాభం అప్

క్యూ2లో రూ. 3,781 కోట్లు



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ దిగ్గజం పవర్ గ్రిడ్ కార్ప్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) రెండో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. జూలై–సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 4 శాతం వృద్ధితో రూ. 3,781 కోట్లను అధిగమించింది. గతేడాది(2022–23) ఇదే కాలంలో రూ. 3,650 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 11,349 కోట్ల నుంచి రూ. 11,530 కోట్లకు ఎగసింది. కంపెనీ బోర్డు వాటాదారులకు షేరుకి రూ. 4 చొప్పున మధ్యంతర డివిడెండును ప్రకటించింది. డిసెంబర్ 6కల్లా చెల్లించనుంది.

ఫలితాల నేపథ్యంలో పవర్ గ్రిడ్ షేరు ఎన్‌ఎస్‌ఈలో దాదాపు యథాతథంగా రూ. 208 వద్ద ముగిసింది.

జోయాలుక్కాస్ దీపావళి క్యాష్‌బ్యాక్ ఆఫర్లు



హైదరాబాద్: దీపావళి సందర్భంగా జోయాలుక్కాస్ క్యాష్‌బ్యాక్ ఆఫర్లు ప్రకటించింది. రూ.50,000 విలువైన డైమండ్, అన్ కట్ డైమండ్స్–ప్రెషస్ జ్యువెలరీ కొనుగోలుపై రూ.2 వేల విలువైన క్యాష్‌బ్యాక్ గిఫ్ట్ వోచర్ పొందవచ్చు. అలాగే రూ.50 వేల విలువైన బంగారం ఆభరణాల కొనుగోలుపై రూ.1000 విలువైన క్యాష్‌బ్యాక్ గిఫ్ట్ వోచర్, రూ.10వేల విలువైన వెండి ఆభరణాలపై రూ.500 విలువైన గిఫ్ట్ వోచర్లు అందిస్తుంది. అడ్వాన్స్ బుకింగ్ స్కీమ్‌తో షాపింగ్ చేసే కస్టమర్లు ప్రోత్సాహక బహుమతి పొందొచ్చు. ఇప్పటికే ప్రారంభమైన ఆఫర్లు నవంబర్ 12 వరకు అమలులో ఉంటాయి. క్యాష్‌బ్యాక్ రూపంలో కస్టమర్లకు మేమిచ్చే బహుమతులు వారి దీపావళిని మరింత శోభాయమానం చేస్తాయని సంస్థ ఎండీ జాయ్ అలుక్కాస్ తెలిపారు.

3 రోజుల లాభాలకు బ్రేక్

- స్వల్ప నష్టాల ముగింపు
- విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాల ప్రభావం



ముంబై: దేశీయ మార్కెట్లో విదేశీ ఇన్వెస్టర్ల విక్రయాలు కొనసాగడంతో స్టాక్ సూచీల 3 రోజుల వరుస లాభాలకు మంగళవారం బ్రేక్ పడింది. ఆసియా, యూరప్ మార్కెట్లలో నెలకొన్న బలహీన సంకేతాలు సెంటిమెంట్‌పై ప్రతికూల ప్రభావం చూపాయి. ఛత్తీస్‌గఢ్, మిజోరం అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా ట్రేడర్లు ఆచితూచి వ్యవహరించారు. ట్రేడింగ్‌లో 383 పాయింట్ల రేంజ్‌లో కదలాడిన సెన్సెక్స్ చివరికి 16 పాయింట్ల స్వల్ప నష్టంతో 64,942 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 94 పాయింట్ల పరిధిలో కదలాడింది. ఆఖరికి ఐదు పాయింట్ల నష్టంతో 19,407 వద్ద నిలిచింది. చైనా అక్టోబర్ ఎగుమతులు భారీగా క్షీణించినట్లు డేటా వెల్లడికావడంతో ఆసియాలో ఒక్క తైవాన్ తప్ప మిగిలిన అన్ని దేశాల స్టాక్ సూచీలు 2% నష్టపోయాయి. కార్పొరేట్ క్యూ3 ఆర్థిక ఫలితాల ప్రకటన, ఇంధన షేర్ల పతనంతో యూరప్ మార్కెట్లు ఒకశాతం మేర పతనమయ్యాయి.

- హోనాసా కన్జూమర్ లిస్టింగ్ పర్వాలేదనిపించింది. బీఎస్‌ఈలో ఇష్యూ ధర(రూ.324) వద్దే లిస్టయ్యింది. చివరికి 4% లాభంతో రూ.337 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.10,848 కోట్లుగా నమోదైంది.
- ఈఎస్ఏఎఫ్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ ఐపీఓ చివరిరోజు నాటికి 73.15 రెట్లు సబ్‌స్క్రయిబ్ అయ్యింది. 5.77 కోట్ల ఈక్విటీలను జారీ చేయగా 422 కోట్ల ఈక్విటీలకు బిడ్లు దాఖలయ్యాయి. క్యూఐబీ కోటా 173.52 రెట్లు, సంస్థాగతేర ఇన్వెస్టర్ల కోటా 84.37 రెట్లు, రిటైల్ ఇన్వెస్టర్ల కోటా 16.97 రెట్లు సబ్‌స్క్రయిబ్ అయ్యాయి.

మ్యాక్సివిజన్ బ్రాండ్ అంబాసిడర్‌గా ధోని



చెన్నై: కంటి సంరక్షణ సేవల సంస్థ మ్యాక్సివిజన్‌సూపర్ స్పెషాలిటీ ఐ హాస్పిటల్స్ తాజాగా క్రికెటర్ మహేంద్ర సింగ్ ధోనిని తమ బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించుకుంది. అన్ని వర్గాలకు చిరపరిచితమైన ధోని వంటి దిగ్గజంతో జత కట్టడమనేది.. క్రమం తప్పకుండా కంటి చెకప్‌లు చేయించుకోవాల్సిన ఆవశ్యకతపై ప్రజల్లో అవగాహన పెంచడానికి దోహదపడగలదని సంస్థ సీఎండీ జీఎస్‌కే వేలు తెలిపారు. చౌకగా కంటి సంరక్షణ సేవలను అందరికీ అందుబాటులోకి తేవాలని తాము లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన చెప్పారు. తమ నెట్‌వర్క్‌లోని 40కిపైగా ఆస్పత్రుల్లో నిత్యం వేల కొద్దీ పేషెంట్లకు సర్వీసులు అందిస్తున్నామని సంస్థ సీఈవో సుధీర్ వీఎస్ తెలిపారు.

భవిత

ప్రభుత్వ ఉద్యోగాల సమగ్ర సమాచారం జాబ్ పాయింట్ కోసం | ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

విద్యార్థులకు సాక్షి ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో..'చిల్డ్రన్స్ డే' పోటీలు
1. Quiz on India's Freedom Movement 2. Photo Contest
పూర్తి వివరాలకు ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీకు కావాల్సిన సమాచారం తెలుసుకోండి.

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

జాబ్ పాయింట్

ఎన్ఐఆర్‌డీపీఆర్, హైదరాబాద్‌లో యంగ్ ప్రొఫెషనల్ పోస్టులు

హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీరాజ్.. ఒప్పంద ప్రాతిపదికన యంగ్ ప్రొఫెషనల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 04
» **అర్హత:** పీజీ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. ఎంబీఏ(హెచ్ఆర్) చేసిన వారికి ప్రాధాన్యం ఉంటుంది. వయసు: 30 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.32,000.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 12.11.2023
» **వెబ్‌సైట్:** www.nirdpr.in

పీజీసీఐఎల్, న్యూఢిల్లీలో 10 ఆఫీసర్ ట్రైనీ(లా) పోస్టులు

న్యూఢిల్లీలోని పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(పీజీసీఐఎల్).. క్లాట్ 2024 స్కోరు ద్వారా ఆఫీసర్ ట్రైనీ(లా) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 10
» **అర్హత:** 60 శాతం మార్కులతో ఎల్ఎల్‌బీ లేదా ఇంటిగ్రేటెడ్ లా/ఎల్ఎల్‌బీ కోర్సు ఉత్తీర్ణతతో పాటు క్లాట్–2024 స్కోరు సాధించి ఉండాలి.
» **వయసు:** 29.11.2023 నాటికి 28 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** క్లాట్–2024 స్కోర్, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 09.11.2023.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 29.11.2023
» **వెబ్‌సైట్:** www.powergrid.in

అల్లూరి సీతారామరాజు జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖలో 13 ఉద్యోగాలు

అల్లూరి సీతారామరాజు జిల్లా మహిళా, శిశు సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయం.. ఒప్పంద ప్రాతిపదికన వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 13
» **పోస్టుల వివరాలు:** జిల్లా కోఆర్డినేటర్–1, జిల్లా ప్రాజెక్ట్ అసిస్టెంట్–1, బ్లాక్ కోఆర్డినేటర్–11.
» **అర్హత:** సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి
» **వేతనం:** నెలకు జిల్లా కోఆర్డినేటర్‌కు రూ.30,000. జిల్లా ప్రాజెక్ట్ అసిస్టెంట్‌కు రూ. 18,000. బ్లాక్ కోఆర్డినేటర్‌కు రూ.20,000
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును జిల్లా మహిళా, శిశు సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయం, బాలసదన్ పక్కన, పాడేరు, అల్లూరి సీతారామ రాజు జిల్లా చిరునామాకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 10.11.2023.
» **వెబ్‌సైట్:** allurisitharamaraju.ap.gov.in

బెల్ బెంగళూరులో 16 ప్రాజెక్ట్ ఇంజనీర్ పోస్టులు

బెంగళూరులోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, బెంగళూరు కాంప్లెక్స్.. ఒప్పంద ప్రాతిపదికన ప్రాజెక్ట్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 16
» **అర్హత:** బీఈ, బీటెక్(ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ /ఎలక్ట్రానిక్స్ /టెలికమ్యూనికేషన్/కమ్యూనికేషన్/ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ /ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్/ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్/ఇన్‌స్ట్రుమెంటేషన్).
» **వేతనం:** నెలకు రూ.40,000 నుంచి రూ.55,000 వరకు ఉంటుంది.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 18.11.2023
» **వెబ్‌సైట్:** www.belindia.in

నంద్యాల జిల్లా మహిళా,శిశు సంక్షేమ, సాధికారత కార్యాలయంలో 23 పోస్టులు

నంద్యాల జిల్లా మహిళా, శిశు సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయం.. ఒప్పంద ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 23
» **పోస్టుల వివరాలు:** జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్–01, ప్రొటెక్షన్ ఆఫీసర్ ఇన్‌స్టిట్యూషనల్ కేర్–01, ప్రొటెక్షన్ ఆఫీసర్ నాన్ ఇన్‌స్టిట్యూషనల్ కేర్–01, లీగల్ కమ్ ప్రొటెక్షన్ ఆఫీసర్–01, కౌన్సిలర్–01, సోషల్ వర్కర్–02, అకౌంటెంట్–01, డేటా అనలిస్ట్–01, అసిస్టెంట్ కమ్ డేటాఎంట్రీ ఆపరేటర్–01, అవుట్‌రీచ్ వర్కర్స్–02, మేనేజర్/కోఆర్డినేటర్(మహిళలు)–01, సోషల్ వర్కర్ కమ్–ఎర్లీ చైల్డ్‌హుడ్ ఎడ్యుకేటర్(మహిళలు)–01, నర్సు(మహిళలు)–01, డాక్టర్(పార్ట్‌టైమ్)–01, ఆయా(మహిళలు)–06, చౌకీదార్(మహిళలు)–01.
» **అర్హత:** సంబంధిత విభాగంలో డిప్లొమా, ఇంటర్,డిగ్రీ,పీజీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి. **వయసు:** 42 ఏళ్లు మించకూడదు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును జిల్లా మహిళా, శిశు సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయం, బీఎస్ఎన్ఎల్ క్వార్టర్స్, బొమ్మలసత్రం, నంద్యాల చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 10.11.2023.
» **వెబ్‌సైట్:** nandyal.ap.gov.in

ఐఐఎంల్లో.. సమ్మర్ ప్లేస్‌మెంట్స్ హవా!

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్.. సంక్షిప్తంగా ఐఐఎం! మేనేజ్‌మెంట్ విద్యలో అంతర్జాతీయ ప్రమాణాలు పాటిస్తూ.. విద్యార్థులకు నిత్యనూతన నైపుణ్యాలు అందించడంలో.. ముందుండే ఇన్‌స్టిట్యూట్స్!! వీటిలో కోర్సులు పూర్తి చేసుకుంటే.. కార్పొరేట్ సంస్థల రెడ్ కార్పెట్ స్వాగతం ఖాయం అనే అభిప్రాయం! ఐఐఎంల్లో ఇటీవల సమ్మర్ ప్లేస్‌మెంట్ ప్రక్రియ మొదలైంది! పలు సంస్థలు భారీ స్టయిఫండ్‌తో ఎస్‌పీఓలు ఖరారు చేస్తున్నాయి! ఈ నేపథ్యంలో.. ఐఐఎంల్లో సమ్మర్ ప్లేస్‌మెంట్ ఆఫర్స్ తాజా ట్రెండ్స్, అవకాశాలు కల్పిస్తున్న రంగాలు, స్టయిఫెండ్స్ తదితర వివరాలు..

» ఐఐఎంలలో మొదలైన ఎస్‌పీఓ ప్రక్రియ
» పలు ఇన్‌స్టిట్యూట్స్‌లో వందశాతం ఆఫర్లు
» సగటున రూ.2 లక్షల స్టయిఫండ్



ఎంబీఏ స్పెషల్

కార్పొరేట్ సంస్థలకు ఐఐఎం విద్యార్థులు హాట్ కేక్స్ అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఆయా కంపెనీలకు అవసరమైన నిర్వహణ నైపుణ్యాలు ఐఐఎంల విద్యార్థుల్లో ఉంటాయని భావించడమే ఇందుకు నిదర్శనం. తాజాగా ఐఐఎంలలో కొనసాగుతున్న ఎస్‌పీఓ ప్రక్రియ, అందిస్తున్న ఆఫర్లే ఇందుకు నిదర్శనం అంటున్నారు నిపుణులు.

సమ్మర్ ప్లేస్‌మెంట్స్‌గా

ఐఐఎం పీజీ ప్రోగ్రామ్‌ల్లో చేరిన విద్యార్థులు మొదటి సంవత్సరం పూర్తయ్యాక లభించే సెలవు రోజుల్లో సమ్మర్ ప్లేస్‌మెంట్స్ చేస్తారు. అంతకు ముందు కంపెనీలు విద్యార్థులను ఇంటర్న్ ట్రైనీగా ఎంపిక చేసేందుకు ప్రత్యేక ప్రక్రియ నిర్వహిస్తారు. ఈ సమ్మర్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో నెగ్గిన విద్యార్థులకు సంస్థలు రెండు వారాల వ్యవధిలో ఇంటర్న్ ట్రైనీగా విధులు నిర్వహించడానికి అవకాశం కల్పిస్తాయి. ఇలా ఇంటర్న్ ట్రైనీగా ఎంపికైన వారికి స్టయిపండ్ పేరుతో ఆర్థిక ప్రోత్సాహకాలు కూడా అందిస్తాయి. ఇది రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు ఉంటుంది.

అందరికీ ఆఫర్స్

- 2023–25 బ్యాచ్ విద్యార్థులకు సమ్మర్ ప్లేస్‌మెంట్ ఆఫర్స్ వెల్లువెత్తున్నాయి.
- ఐఐఎం–లక్నోలో మొత్తం 576 మంది విద్యార్థులకు సమ్మర్ ప్లేస్‌మెంట్ ఆఫర్స్ లభించాయి. వీరికి సగటు స్టయిఫండ్ నెలకు రూ 1.31 లక్షలుగా, గరిష్ట స్టయిఫండ్ రూ.3.5 లక్షలుగా నిలవడం గమనార్హం.
- ఐఐఎం–కోల్‌కతలో.. 466 మంది విద్యార్థులకు గాను అందరికీ సమ్మర్ ప్లేస్‌మెంట్స్ లభించడం విశేషం. వీరికి సగటు స్టయిఫండ్ రూ.1.65 లక్షలుగా, గరిష్ట స్టయిఫండ్ రూ.3.75 లక్షలుగా ఉంది.
- ఐఐఎం–నాగపూర్‌లోనూ నూటికి నూరు శాతం విద్యార్థులకు సమ్మర్ ప్లేస్‌మెంట్స్ లభించాయి. సగటు స్టయిఫండ్ రూ.79 వేలుగా ఉంది.

కొనసాగుతున్న ప్రక్రియ

దేశంలోని ఇతర ఐఐఎంలలోనూ ప్రస్తుతం సమ్మర్ ప్లేస్‌మెంట్ ఆఫర్స్ ప్రక్రియ కొనసాగుతోంది. ఐఐఎం–అహ్మదాబాద్, బెంగళూరు తదితర క్యాంపస్‌లలో ఈ నెల రెండో వారంలోపు ఈ ప్రక్రియ పూర్తవనుంది. ఇప్పటి వరకు లభించిన సమాచారం ప్రకారం–ఇతర ఐఐఎంలలోనూ సమ్మర్ ప్లేస్‌మెంట్స్ దాదాపు వంద శాతం లభించే సంకేతాలున్నాయని ఆయా క్యాంపస్ ప్లేస్‌మెంట్ వర్గాలు పేర్కొంటున్నాయి.

బీఎఫ్ఎస్ఐ, కన్సల్టింగ్, ఫైనాన్స్

- ఐఐఎంలు, ఇతర బి–స్కూల్స్‌లో సమ్మర్ ప్లేస్‌మెంట్స్‌లో ఈ ఏడాది కన్సల్టింగ్, ఫైనాన్స్ రంగాల హవా కనిపించింది. ఇప్పటి వరకు అన్ని బి–స్కూల్స్‌లో దాదాపు 40 శాతం మేర సమ్మర్ ప్లేస్‌మెంట్స్.. కన్సల్టింగ్, ఫైనాన్స్ రంగాలకు చెందిన సంస్థల నుంచే ఉన్నాయి. బీసీజీ, బెయిన్ అండ్ కో, యాక్సెంచర్ స్ట్రాటజీ, పీడబ్ల్యూసీ, డెలాయిట్, కేపీఎంజీ, సినర్జీ కన్సల్టింగ్ కంపెనీలు టాప్ రిక్రూటర్స్‌గా నిలిచాయి.
- కన్సల్టింగ్, ఫైనాన్స్ రంగాల తర్వాత ఐటీ, ఈ–కామర్స్ సంస్థలు టాప్ రిక్రూటర్స్‌గా ఉన్నాయి. ఈ రంగాల్లో డేటా మేనేజ్‌మెంట్, ఫైనాన్స్, మార్కెటింగ్ విభాగాల్లో ఇంటర్న్‌షిప్ చేసే విధంగా ఆఫర్లు లభించాయి. అదే విధంగా గూగుల్, ఫేస్‌బుక్ సంస్థలు కూడా ఎస్‌పీఓ ఆఫర్లు కల్పించాయి.

సేల్స్, అండ్ మార్కెటింగ్‌లోనూ

సేల్స్ అండ్ మార్కెటింగ్ ప్రొఫైల్స్‌లోనూ ఈ ఏడాది సమ్మర్ ప్లేస్‌మెంట్స్ జోరు కొనసాగింది. ముఖ్యంగా ప్రొడక్ట్ రీసెర్చ్, మార్కెట్ అనాలిసిస్ విభాగాల్లో విధులు నిర్వర్తించే విధంగా ఈ ఆఫర్స్ లభించాయి. అదే సమయంలో జనరల్ మేనేజ్‌మెంట్ విభాగంలోనూ సమ్మర్ ప్లేస్‌మెంట్ ఆఫర్స్ ఖరారయ్యాయి. పలు సంస్థలు ఈ విభాగాల్లో విద్యార్థులను నియమించుకునే క్రమంలో విశ్లేషణాత్మక దృక్పథం, మార్కెట్ పరిస్థితులపై వారికున్న అవగాహనను క్షుణ్నంగా పరిశీలించి ఆఫర్స్ ఇచ్చినట్లు ఐఐఎంల వర్గాలు పేర్కొన్నాయి.

ఈ ప్రొఫైల్స్‌లో అధికంగా

సమ్మర్ ప్లేస్‌మెంట్ ఆఫర్స్‌లో ఎక్కువగా డేటా మేనేజ్‌మెంట్; ఫైనాన్స్ మేనేజ్‌మెంట్; జనరల్ అడ్మినిస్ట్రేషన్; సేల్స్ అండ్ మార్కెటింగ్; డేటా అనలిటిక్స్; బిజినెస్ స్ట్రాటజీస్ ప్రొఫైల్స్ ముందంజలో ఉంటున్నాయి.

ఎందుకంత క్రేజ్

సమ్మర్ ప్లేస్‌మెంట్స్ పేరిట కంపెనీలు ఐఐఎంల విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ ఆఫర్స్, రూ.లక్షల్లో స్టయిపండ్ ఇవ్వడానికి కారణం ఏంటి? అంటే వినిపిస్తున్న సమాధానం.. ఈ ఇన్‌స్టిట్యూట్‌ల విద్యార్థులకు రియల్ టైమ్ నైపుణ్యాలు, అప్‌డేటెడ్ నాలెడ్జ్ ఉంటుందని ఆయా సంస్థలు భావించడమేననే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఇక్కడ బోధన విధానాలు అత్యున్నత స్థాయిలో ఉంటాయి. విద్యార్థులను కార్పొరేట్ లీడర్లుగా తీర్చిదిద్దే విధంగా కరిక్యులం ఉంటుంది. అందుకే ఈ ఇన్‌స్టిట్యూట్స్ నుంచి ఇంటర్న్ ట్రైనీలను నియమించుకునేందుకు సంస్థలు ఆసక్తి చూపుతున్నాయని పేర్కొంటున్నారు.

పూర్తిస్థాయి కొలువుకు మార్గం

సమ్మర్ ప్లేస్‌మెంట్స్ ట్రైనింగ్ సమయంలో విద్యార్థులు చూపే పనితీరు ఆయా సంస్థల్లో పూర్తి స్థాయి కొలువుకు మార్గంగా నిలుస్తుంది. ఎస్‌పీఓ దక్కించుకున్న అభ్యర్థులు ట్రైనీగా ప్రతిభ చూపితే.. అదే సంస్థలో శాశ్వత నియామకం సొంతం చేసుకునే అవకాశం కూడా ఉంది. ఇంటర్న్‌షిప్ చేసిన సమయంలో తమకు కేటాయించిన విధులు, విభాగాల్లో తమ సామర్థ్యాలను, నైపుణ్యాలను ప్రదర్శించిన వారికి కంపెనీలు ముందుగానే ఆఫర్స్ ఖరారు చేస్తున్నాయి. ఇలాంటి అభ్యర్థులకు ద్వితీయ సంవత్సరం చివర్లో నిర్వహించే ఫైనల్ ప్లేస్‌మెంట్స్ ప్రక్రియల్లో పాల్గొనకుండానే ఫైనల్ ఆఫర్ లభిస్తుంది.

ఫైనల్ ప్లేస్‌మెంట్స్

ప్రస్తుతం సమ్మర్ ప్లేస్‌మెంట్ ట్రెండ్స్‌ను పరిగణనలోకి తీసుకుంటే.. ఫైనల్ ప్లేస్‌మెంట్ ప్రక్రియ కూడా ఆశాజనకంగా ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. సంస్థల వ్యాపారాలు పుంజుకుంటున్నాయని, అవి తమ కార్యకలాపాలు విస్తరించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాయని క్యాంపస్ ప్లేస్‌మెంట్ వర్గాలు పేర్కొంటున్నాయి. అందుకు అవసరమైన స్కిల్స్ ఉన్న వారిని నియమించుకునేందుకు ప్లేస్‌మెంట్స్‌కు వస్తున్నాయని చెబుతున్నారు.

ఇతర బి–స్కూల్స్‌లోనూ

ఐఐఎంలతోపాటు దేశంలోని ఇతర ప్రముఖ బి–స్కూల్స్‌లోనూ ఈ ఏడాది సమ్మర్ ప్లేస్‌మెంట్ డ్రైవ్స్ ఆశాజనకంగా ఉండనున్నాయి. అలాగే మరో ప్రముఖ బీస్కూల్ ఎక్స్‌ఎల్ఆర్ఐ–జెంషెడ్‌పూర్‌లోనూ వంద శాతం ఇంటర్న్‌షిప్ ఆఫర్లు లభించాయి. అంతేకాకుండా రెండు నెలల వ్యవధికి ఇచ్చే స్టయిపండ్ కూడా గరిష్టంగా రూ.3.5 లక్షలుగా నమోదవడం విశేషం. అదే విధంగా ఢిల్లీ యూనివర్సిటీ ఫ్యాకల్టీ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగంలోనూ ఎంబీఏ విద్యార్థులకు బెస్ట్ ఆఫర్లు లభిస్తాయని భావిస్తున్నారు.